గడపగడపకూ సంక్షేమం

- ఏలూరులో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు
- తాజాగా రూ.31.60కోట్ల నిధులకు ప్రణాళిక
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని చొరవతో నిధుల మంజూరు



ఏలూరు మంచినీళ్ల తోటలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు



వైఎస్సార్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో గడపగడపకూ సంక్షేమం పథకాల లబ్ధి అందుతోంది. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏలూరు నగరంలో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని ప్రజలకు సంక్షేమంతోపాటు, నగరంలో అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే నాని పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయా డివిజన్ల పరిధిలో గడపగడపకూ నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు.

అభివృద్ధి పనుల వివరాలు

- ఏలూరు మంచినీళ్ల తోట ప్రాంతంలో 15 ఏళ్లుగా సరైన రోడ్డులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో సీసీ రోడ్లు వేయించారు.
- 49వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టారు.
- 9వ డివిజన్‌లో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోటేపల్లివారి వీధి తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించారు.
- వన్‌టౌన్ 18వ డివిజన్‌లో కార్పొరేటర్ కేదారేశ్వరి, జగదీష్ ఆధ్వర్యంలో వంగాయగూడెం కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు.
- వన్‌టౌన్ 16వ డివిజన్‌లో కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, రమేష్ ఆధ్వర్యంలో రూ. కోటితో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించి, దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న తరుణంలో స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులతో స్థానికంగా రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, ఇతరత్రా అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు నగరంలో ఇప్పటికే రూ.12 కోట్ల మేర నిధులను అభివృద్ధి పనులకు విడుదల చేశారు.

భారీగా నిధులకు ప్రతిపాదనలు

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 60 సచివాలయ పరిధిలో 120 రోజుల పాటు నగరంలో పర్యటించారు. ఒక్కో సచివాలయానికి రూ.20లక్షల చొప్పున రూ.12కోట్లు నిధుల విడుదలకు కృషి చేశారు.వాటితో అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇక తాజాగా నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే ఆళ్ళనాని నిధుల మంజూరులో సఫలీకృతం అయ్యారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు విడుదలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో మరో రూ.12కోట్లు నిధులు విడుదల కానున్నాయి. మరోవైపు నగరంలో ఇంకా మిగిలిన 19 సచివాలయాలకు రూ.40లక్షల చొప్పున మరో రూ.7.60 కోట్లు రానున్నాయి. మొత్తంగా చూస్తే ఏలూరు నియోజకవర్గంలో గడపగడపకు కార్యక్రమానికి రూ.31.60 కోట్ల నిధులు మంజూరు కానున్నాయి.

జోరుగా అభివృద్ధి పనులు



ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని సారథ్యంలో నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా చేపడుతూ స్థానికంగా సమస్యలపై ఎమ్మెల్యే ఆళ్ళనాని ప్రత్యేక దృష్టి సారించారు. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేసేందుకు ఆయన కృషి చేస్తారు. – సోమిశెట్టి చంద్రమౌళి , ఏలూరు వన్‌టౌన్

ప్రజా సమస్యలు పరిష్కారం



ఎమ్మెల్యే ఆళ్ళనాని నేతృత్వంలో ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతమైంది. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన విశేష కృషి చేస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మిస్తున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. – పచ్చిపులుసు సృజన్, వ్యాపారి, ఏలూరు

ఏలూరు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



ఏలూరు అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎమ్మెల్యే ఆళ్ళనాని హయాంలో నిధులు భారీగా మంజూరయ్యాయి. ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధి ఫలాలను అందిస్తున్నారు. 30 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పేదలకు ఇళ్లు నిర్మిస్తూ ప్రజల పట్ల బాధ్యతను నిరూపించుకున్నారు. –గంధం మహేష్, యువజన నాయకులు

క్లుప్తంగా

15న విజయవాడలో సీపీఎం బహిరంగ సభ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15న సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే భారీ ప్రదర్శన, బహిరంగ సభల్లో జిల్లాలోని చేతివృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో–కన్వీనర్ ఆగొల్లు వెంకటకృష్ణారావు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజాప్రజాశిక అమలు కోసం చలో విజయవాడ ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, ఎస్.పుణ్యవతి, సీహెచ్ బాబూరావు, కె.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలియజేసారు. సభను జయప్రదం చేయాలని ఆదిశేషు, కృష్ణారావు కోరారు.

నేడు మహిళా సమాఖ్య జిల్లా ప్రథమ మహాసభ



రాష్ట్ర మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహా సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 14న జంగారెడ్డిగూడెంలో నిర్వహించే మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏలూరు నగర అధ్యక్ష,కార్యదర్శులు కొండేటి బేబి, అడ్డగర్ల లక్ష్మి ఇందిర కోరారు. జంగారెడ్డిగూడెంలోని చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలులో ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను నిర్వహిరచనున్నట్లు వారు తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సోమవారం నిర్వహించిన నగర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి నంద్యాలలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర 15వ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల లోక్‌సభలో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2029 తర్వాత అమలు చేస్తామని చెప్పడం మహిళలను మోసగించడమే అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ నెల 17,18,19 తేదీల్లో నంద్యాల్లో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు గొర్లి స్వాతి, నగర సహాయ కార్యదర్శి కొల్లూరు సుధారాణి, మావూరి విజయ, మన్నవ యామిని పాల్గొన్నారు.

15న ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ ధర్నా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా అధ్యో, ప్రధాన కార్యదర్శులు రెడ్డిదొర, ఎస్కే రంగావలి కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలను సకాలంలో మంజూరు చేయాలని, మంజూరు చేసిన డీఏ బకాయిలు పీఎఫ్ ఖాతాలకు వెంటనే జమచేయాలని, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు వెంటనే చెల్లించాలని తదితర 12 డిమాండ్లతో ఏపీటీఎఫ్ ధర్నా తలపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, చట్టం మేరకు చర్యలు తీసుకుంటామని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ హెచ్చరించారు. ఏలూరు తూర్పువీధి వీవర్స్ కాలనీలో పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి రూ.6,010 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని సీఐ రాజశేఖర్ తెలిపారు.

చంద్రమోహన్ మృతి సినీ రంగానికి తీరని లోటు

ఏలూరు (టూటౌన్): ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ మృతి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని ప్రజానాట్యమండలి కళాకారుడు పి.ఆదిశేషు సోమవారం అన్నారు. చంద్రమోహన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేసారు. రంగుల రాట్నం సినిమాతో ప్రారంభమైన ఆయన సినీ జీవితం అనేక మంది కళాకారులతో కలిసి 932 సినిమాల్లో విభిన్న తరహా పాత్రలు పోషించారన్నారు. మంచి పాత్రలు పోషించి చంద్రమోహన్ గుర్తింపు పొందారని అన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీల్లో నిశ్చల ప్రతిభ



రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో మూడోస్థానంలో నిలిచిన నిశ్చల

ఏలూరు రూరల్: ఏలూరులో అబ్రహం, గ్యారీ కాస్పరోవ్ చెస్ అకాడమీకి చెందిన వై నిశ్చల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యిందని అకాడమీ డైరక్టర్ వై యోహనాన్ తెలిపారు. రెండురోజుల క్రితం ఏలూరులో నిర్వహించిన అండర్–19 రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో నిశ్చల బాలికల విభాగంలో 3 స్థానంలో నిలిచిందని వివరించారు. ఫలితంగా నిర్వాహకులు ఆమెను జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టుకు ఎంపిక చేశారని వెల్లడించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె జయరాజు, అసోసియేషన్ సభ్యుడు ఎం అచ్చుతరావు ఆమెను అభినందించారు.

శైవ క్షేత్రాల్లో కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు

- నెల రోజుల పాటు నగరంలో ఆధ్యాత్మిక శోభ
- మార్మోగనున్న శివనామ స్మరణ
- శైవక్షేత్రాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చనలకు ఏర్పాట్లు



పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక మాసానికి తెలుగు గడ్డపై ఒక విశిష్ట స్థానముంది. ఈ మాసంలోనే అయ్యప్ప స్వామి మాలధారణతో పాటు వివిధ స్వాముల మాలధారణలు చేసి భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతుంటారు. గడ్డ కట్టే చలి వాతావరణంలో సైతం తెల్లవారుజామునే నిద్రలేచి స్నానాదులు ఆచరించి నిష్ఠతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. కార్తీక మాసోత్సవాలకు నగరం ముస్తాబయింది. వివిధ శైవ క్షేత్రాల్లో ఆలయ ప్రతినిధులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు నెల రోజుల పాటు నగరంలో శివనామ స్మరణ మార్మోగనుంది. శైవ భక్తులు కార్తీక మాసం అత్యంత పుణ్యప్రదమైన మాసంగా భావిస్తారు. మహిళలు తెల్లవారు జామునే లేచి కార్తీక దీపాలు వెలిగించి భక్తితో మొక్కుతారు. పురుషులు మద్యపానం, మాంసాహారానికి ఈ నెల రోజులూ విరామం ప్రకటించి శివయ్య స్మరణలో గడుపుతారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో స్వామి వార్లకు ప్రదోషకాల అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తారు. వీటితో పాటు ఆకాశ దీప పూజలు, విశేష హారతి సేవలు, లక్ష కుంకుమార్చనలు, జ్వాలా తోరణాలు, శాంతి కళ్యాణాలు తదితర పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

విశేష దినాలివే..

శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ఈ ఏడాది నవంబర్ 14న మంగళవారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో విశేష అభిషేకాలు, అలంకరణలు, గో పూజలు, ఆకాశ దీప పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 20న ప్రథమ కార్తీక సోమవారం రాగా నవంబర్ 27, డిసెంబర్ 4,11 తేదీల్లో కార్తీక సోమవారాలు వచ్చాయి. ఈ ఏడాది కార్తీక పౌర్ణమి ఈ నెల 26న ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో జ్వాలా తోరణ పూజలు, అనంతరం స్వామి వార్ల ఊరేగింపులు నిర్వహించనున్నారు. 30వ తేదీన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు సహస్ర నామ కుంకుమార్చనలు, లక్ష బిల్వార్చనలు నిర్వహించనున్నారు. పలు ఆలయాల్లో వివిధ పుణ్య దినాల్లో జ్యోతిర్లింగ పూజలు నిర్వహించనున్నారు. పుబ్బ నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు సామూహిక లక్ష కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశాఖ నక్షత్రం సందర్భంగా డిసెంబర్ 10, 11 తేదీల్లో స్వామి వారు అమ్మవార్ల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. డిసెంబర్ 13న పోలి స్వర్గం పూజలతో కార్తీక మాసం ముగియనుంది.

నగరంలోని శైవ క్షేత్రాల వివరాలు

కార్తీక మాసంలో నగరంలో విశేషంగా పూజలు నిర్వహించే శైవక్షేత్రాల వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పత్తేబాదలో చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, దక్షిణపు వీధిలో జలాపహరేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని నగరేశ్వర స్వామి దేవస్థానం, అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేట శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీ పర్వత వర్ధని సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో వేంచేసిన సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	40
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	24-28	కీరా దోస	44
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	38	అల్లం	130
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	23
క్యారెట్	48	పాలకూర	10
దొండకాయలు	18	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	44-55	గోంగూర	06
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	24

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు రూరల్: చాటపర్రులో గ్రంథాలయ వారోత్సవాలు 14వ తేదీ నుంచి ఈ నెల 20 వరకూ నిర్వహిస్తామని గ్రంథాలయ నిర్వాహకురాలు కె వాసుకి తెలిపారు. వారంరోజుల పాటు బాలబాలికలకు ఉదయం 10 గంటలకు పలు రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు.ఆఖరిరోజు 20వ తేదీ అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

22న చీరల వేలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుళ్ళ సెంటర్లో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం వేయనున్నట్లు కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు తెలిపారు. ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు వేలం కార్యక్రమం ప్రారంభమతుందని, ఈ బహిరంగ వేలంలో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దళితుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

దెందులూరు: సీతంపేటలో సురక్షిత తాగునీటి సరఫరా స్థానికులకు అసౌకర్యం కలగరాదని రూ.5.5 లక్షలతో నూతన ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రారంభించామని వైఎస్సార్ సీపీ దెందులూరు మండలాధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నట్టా లీలా నవకాంతం అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహాయ సహకారాలతో రూ.5.5 లక్షలతో నిర్మించిన నూతన ఆర్వో ప్లాంట్‌ను సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య బాబి, ఎంపీటీసీ పులవర్తి వరమణి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్, రాజు, జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

రజక వృత్తి చెరువులను సర్వే చేయించాలి



స్థానిక రజక జన సంఘం జిల్లా కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న రజక వృత్తి చెరువులను సర్వే చేయించి హద్దులను నిర్ణయించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన రజక సంక్షేమ కమిటీ సమావేశంలో రజకుల చెరువులను సర్వే చేయించాలని కోరుతూ 200 గ్రామాల చెరువుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జిల్లాలోని గ్రామాల్లో వున్న వృత్తి చెరువులను సర్వే చేయించడం వల్ల ఆక్రమణదారులతో పలు ప్రాంతాల్లో ఇబ్బందులు తొలగాయన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న రజకుల పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించాలని కోరారు. రజక వృత్తి చెరువులను ఉపాధి హామీలో చేర్చి వాటి పూడికలను తీయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం అనంతరం కైకలూరు మండలం భుజబలపట్నం రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పూరు సత్తియ్య, ఉపాధ్యక్షుడిగా భజనపాలెం శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోతుమూడు కుమార్ స్వామి,సహాయ కార్యదర్శిగా బందారు రామయ్య, కోశాధికారిగా వేల్పూరు నాగరాజు, సలహా సభ్యులుగా మూతే కృష్ణ, అత్తిలి వెంకట కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజక నేతలు పొట్లూరు మురళీకృష్ణ, వి.శ్రీనివాసు,పి. సుబ్బయ్య, అన్నవరం సుబ్రహ్మణ్యం, బయ్యన్నగూడెం లక్ష్మీప్రసన్న, కె.దుర్గారావు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తా



రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించి భరోసా కల్పించారు. సోమవారం రాత్రి పెదవేగి మండలం లక్ష్మీపురంలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించిన ఆయన వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారిని పరామర్శించి, ఆర్థికంగా అండగా నిలిచారు. గ్రామానికి చెందిన యర్రా భాస్కరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరిస్థితులను గమనించి ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న లక్ష్మీపురం గ్రామానికి యర్రా కిషోర్ కుమారుడిని ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మరణించిన బొడ్డు వెంకటేశ్వరరావు ఇంటి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ నాయకులు ఘంటా ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, చోడిశెట్టి వెంకటన్న, మేకా వసంత్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	10
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	09
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	28